క్లుప్తంగా

నేడు సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడప డివిజన్ పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, సైన్సు ఉపాధ్యాయులకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి డీఈఓ రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. డివిజన్ పరిధిలో ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, సైన్సు ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకాలన్నారు. వివరాలకు 94410 35830 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

భూ విజ్ఞానశాస్త్రంలో కృపావతికి డాక్టరేట్


కృపావతి

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం భూ విజ్ఞాన శాస్త్ర విభాగం పరిశోధకురాలు చింతల కృపావతికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. భూ విజ్ఞానశాస్త్ర శాఖ సహ ఆచార్యులు డా. ఎస్. శ్రీనివాసగౌడ్ పర్యవేక్షణలో 'మొగమురేరు నది పరివాహక ప్రాంత పరిశోధనాత్మక విశ్లేషణ: రిమోట్ సెన్సింగ్ అండ్ జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సాంకేతికతతో కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది.

ముఖ హాజరు విధానాన్ని తొలగించాలి


కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న ముఖ హాజరు విధానాన్ని తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయకర్త వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. నిత్యం మొరాయించే ఈ బయోమెట్రిక్ యాప్ వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బయోమెట్రిక్ విధానం తప్పని సరిగా చేయాలనుకుంటే ప్రభుత్వం ఇంటర్‌నెట్‌తోపాటు నాణ్యమైన యంత్రాలు సరఫరా చేసి సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలన్నారు.

మణిపూర్ ఘటనపై ర్యాలీ


కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : మణిపూర్‌లో జరిగిన అమానవీయ ఘటనలకు నిరసనగా మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ర్యాలీ జరిగింది. మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు సురేష్, పీస్ కమిటీ సభ్యుడు పాస్టర్ ప్రసాద్‌రావు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర నాయకులు సుంకేసుల బాదుల్లా మాట్లాడుతూ మణిపూర్‌లో కుకీ, నాగా జాతి ప్రజలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీలను ఊరేగించి అఘాయిత్యాలకు పాల్పడటం దారుణం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ రాష్ట్ర నాయకులు బాదుల్లా, మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విమల, కాంగ్రెస్ నాయకులు లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం


సతీష్‌కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలోని హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(గణిత) విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న సతీష్‌కుమార్‌రెడ్డికి కర్నూల్ రాయలసీమ విశ్వవిద్యాలయం వారు పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈయన పదవీ విరమణ ఆచార్యులు డాక్టర్ రామభూపాల్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ఫ్లూయిడ్ ఫ్లో అండ్ హీట్ ట్రాన్స్‌ఫర్ ప్రాబ్లమ్స్' అనే అంశంపై పరిశోధన చేయడం వల్ల రాయలసీమ విశ్వ విద్యాలయం పీహెచ్‌డీని ప్రదానం చేశారని తెలిపారు.

'స్వాతంత్య్ర' కార్యక్రమాలకు ఆర్థికసాయం

కడప కల్చరల్ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల కోసం ఇంటాక్ జీవితకాల సభ్యుడు మలిశెట్టి జానకిరామ్ రూ.10 వేలు విరాళం అందజేశారు. సోమవారం కడప పాత కలెక్టరేట్‌లోని భారతీయ సాంస్కృతిక, కళావారసత్వ పరిరక్షణ సంస్థ కార్యాలయంలో జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన రూ.10వేలు చెక్కును సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా కడప హెరిటేజ్ పుస్తకాన్ని ఆయనకు బహుకరించి సత్కరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు డా. ఆర్. రంగనాథరెడ్డి, రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఎవరి సిఫారసులతో అవసరం లేదని, అర్హత ఉంటే చాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్ పరిధిలోని ఊటుకూరు, చెమ్ముమియ్యాపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోదావరి విశాలాక్షి అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.10.29లక్షల మేలు చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. మామిడి అలివేలు మంగమ్మ అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం వల్ల రూ.9.41లక్షల లబ్ధి చేకూరిందన్నారు. వి. హారతి అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.9.15లక్షల మేలు జరిగిందని తెలిపారు. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసురెడ్డి, కార్పొరేటర్లు షఫీ, బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, మున్నా, సీహెచ్ సునీల్, రహీం పాల్గొన్నారు.

చేనేత వస్త్రాల వినియోగం పెంచాలి


చేనేత వస్త్రాలు ధరించి ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

వైవీయూ : ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని, వినియోగం విస్తృత ప్రచారం నిర్వహించాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం సందర్భంగా వైవీయూలో 'చేనేత వస్త్రాల వినియోగం'పై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, వేషధారణ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. అనంతరం పలువురు విద్యార్థులు చేనేత వస్త్రధారణలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా మాట్లాడుతూ స్వదేశీ వస్త్రాల గురించి వివరించారు. చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా దేశ జాతీయ ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఆప్కో మెగా షోరూం మేనేజర్ సి. రామకృష్ణ మాట్లాడుతూ చేనేత వస్త్రాల తయారీ, వినియోగం, ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం కళాశాలలో ఆప్కో చేనేత వస్త్రాల స్టాల్‌ను నిర్వహించి విద్యార్థినులకు రాయితీపై వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. గురుమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'విశ్వకవి'కి ఘన నివాళి


విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య బి. అంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సోమవారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ ఆచార్య బి. అంజనేయప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సాహిత్య ప్రతిభను చాటిచెప్పిన గొప్ప కవి ఠాగూర్ అన్నారు. ఆయన రచనలను నేటితరం యువత అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రమాదేవి, ఉషామాధురీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఠాగూర్‌కు నివాళి

కడప ఎడ్యుకేషన్ : జనగణమన ఉత్తమ గీతాన్ని దేశానికి అందించిన రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నిర్మలాదేవి, ప్రముఖులు కొండసుబ్బయ్య అన్నారు. సోమవారం నగరంలోని హబీబుల్లావీధిలోని ఎంపీపీ స్కూల్లో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా, అల్లా బకాస్, నాదేళ్ల దస్తగిరి, బాలయ్య, అమర్నాథ్ పాల్గొన్నారు.

గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలో పాల్గొన్న గ్రామ సేవకులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, వెవెంకటపతిలు మాట్లాడుతూ పే స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. అర్హులకు పదోన్నతులు కల్పించాలన్నారు. డీఏ రికవరీ ఆపి డీఏతో కూడిన వేతనం అమలు చేయాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23, 24 తేదీలలో విజయవాడలో దీక్షలు చేపడతామన్నారు. 25న జగనన్నకు నేరుగా చెబుతాం పేరిట చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈ దీక్షల్లో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, కోశాధికారి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రక్షణకు అంకితమవుదాం

కడప కల్చరల్ : వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈనెల 29వ తేదీన తెలుగు అభిమానులంతా భాషా రక్షణకు ప్రతినబూనాలని తెలుగుభాషా వికాస ఉద్యమ అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డిసర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహానికి పూలమాల అలంకరించి భాషారక్షణకు అంకితమవుదామని భాషాభిమానులతో కలిసి ప్రతినబూనారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తెలుగుభాషను జిల్లాలో సంపూర్ణంగా అమలు చేసేందుకు కమిటీలు వేసి భాషాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. తెలుగు కవుల ఛాయాచిత్రాలను విద్యాలయాలలో, విగ్రహాలను రాజీవ్‌మార్గ్‌లో ప్రతిష్ఠించాలని కోరారు. నగర మధ్యలో గిడుగు రామమూర్తి పంతులు, తెలుగుతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో కె. గణేష్, శివహేమంత్, అనిల్, విక్రమ్, ఆనంద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు చంద్రబాబు కుట్ర

కడప కార్పొరేషన్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నలభైభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరం కావడంతో రాజకీయ ఉన్మాదిలాగా మారిపోయాడన్నారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో విధ్వంస రచన చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయాలకే తలవంపులు తెచ్చేలా రాక్షసత్వంతో చంద్రబాబు దాష్టీకానికి ఒడిగడుతున్నాడని మండిపడ్డారు. పోలీసులకు ఇచ్చిన రూట్ మ్యాప్ ప్రకారం చంద్రబాబు పుంగనూరు పట్టణంలోకి కాకుండా నేరుగా పలమనేరు బైపాస్‌లోకి వెళ్లాల్సి ఉందని, హింసను ప్రేరేపించాలన్న పక్కా వ్యూహంతోనే చంద్రబాబు తన రూట్ మార్చుకున్నారన్నారు. ఈ దాడికి పూర్తి బాధ్యత బాబుదేనని, ఆయనపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు తులశమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న డీవీ సత్యనారాయణ

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ అన్నారు. సమగ్ర సర్వేయాత్ర-2లో భాగంగా సోమవారం కడప నగరంలో జిల్లా, నగర అసోసియేషన్ల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులకు పరికరాల కొనుగోలుకు రూ.2లక్షల వరకూ సబ్సిడీతో రుణ సదుపాయం కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. పాల్‌రాజు, దస్తగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీహరిరావు, కడప జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాన్, కడప నగర అధ్యక్షుడు నరేంద్రకుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటియూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ఆశాల జీతం రూ. 15 వేలకు పెంచాలని, వారిని మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ నాయకులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జంపా ఆశయాలు కొనసాగాలి

కడప ఎడ్యుకేషన్ : ఎందరో విద్యార్థులను చైతన్యవంతులను చేసిన జంపా కృష్ణ కిశోర్ ఆశయాలు కొనసాగాలని జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు బి. విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం కడపలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిషోర్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి జేవీవీ జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సలహామండలి సభ్యులు కొర్రా సురేష్ బాబు, శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య, పట్టణ కార్యదర్శి గౌరీశంకర్, జిల్లా నాయకులు సురేష్, సహాయం పాల్గొన్నారు.

పథకాలు అందజేయడంలో జాప్యం తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో అధికారుల జాప్యం, వివక్షత కారణంగా వారు ఇక్కట్లు పడుతున్నారని జాతీయ చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవ్వారు మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికుడికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి ఎన్‌హెచ్‌డీసీ పథకం అమలు చేయాలని కోరారు.

మెడికల్ కాలేజీల్లో సీట్లు అమ్మకం తగదు

కడప సెవెన్‌రోడ్స్ : కొత్త మెడికల్ కళాశాలల్లో సీట్ల అమ్మకం ఆపి పాత పద్ధతిలోనే ఏ కేటగిరి ద్వారా సీట్లను భర్తీ చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్‌రెడ్డి కోరారు. సోమవారం నగరంలోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, గోపాలకృష్ణయ్య, ఓబులేసు, ఫారూక్, అన్వర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ


మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డిగ్రీ సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం వైవీయూ ప్రధాన పరిపాలనాభవనంలో నిర్వహిస్తున్న కంప్యూటర్స్, వృక్షశాస్త్రం, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బయోటెక్నాలజీ పేపర్లను మూల్యాంకనం చేస్తున్న అధ్యాపకులతో వీసీ మాట్లాడారు. అధ్యాపకులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను క్షుణ్ణంగా చదివి మార్కులు వేయాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ సంబరాలు

కడప వైఎస్సార్ సర్కిల్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంపీగా సభ్యత్వం పునరుద్ధరిస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ ఆధ్వర్యంలో నగరంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర వల్ల ప్రజల్లో వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక బీజేపి ప్రభుత్వం కక్ష పూరిత చర్యలకు పాల్పడిందన్నారు. బీజేపి ఎన్ని కుట్రలు చేసినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బండి జకరయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీయాదవ్, రాజేష్, అనిల్, సాయి పాల్గొన్నారు.

ముత్తరాసుపల్లెలో డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలి


అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ముత్తరాసుపల్లెలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పదో డివిజన్‌లోని ముత్తరాసుపల్లె, అప్సర సర్కిల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, బ్యానర్లపై నగరపాలక సంస్థ ఇచ్చిన చలానా రుసుము ప్రింట్ అయ్యేలా చూడాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. కొండాయపల్లె ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద కల్వర్టులో నీటి ప్రవాహం సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్రాసు రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగేలా వీధి దీపాల స్తంభాలను మార్చాలని ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన «స్పందన» కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 56 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి-23, టౌన్‌ప్లానింగ్-18, పబ్లిక్ హెల్త్-3, హార్టికల్చర్-2, యూసీడీ విభాగం-1, కడప తహసీల్దార్-2, సీకే దిన్నె తహసీల్దార్-1, ఏపీఎస్‌పీడీసీఎల్-1, హౌసింగ్-2 అర్జీలు వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ, డీఈలు, ఏఈలు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

9 న మార్కెట్‌యార్డులో ఉచిత మెగా వైద్య శిబిరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ కుమారుడు అమరేష్ రుషి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు

కడప అగ్రికల్చర్ : నగర మేయర్ సురేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని 9వ తేదీన కడప మార్కెట్‌యార్డులో ఉదయం 9 గంటలకు మార్కెట్‌యార్డు డైరెక్టర్, రక్షణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పల్లె కొండు సంపత్, చైతన్యల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో అవ్వారు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ అర్జునకుమార్‌తోపాటు దంతవైద్యులు డాక్టర్ అనంతరాజులు పాల్గొని వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కడప మార్కెట్‌యార్డులో మేయర్ కుమారుడు అమరేష్ రుషి చేతుల మీదుగా మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బంగారు నాగయ్య, గోపాలకృష్ణ, రామక్రిష్ణ, నాగేంద్రనాయక్, సుచితతోపాటు డాక్టర్స్ విభాగ అధ్యక్షులు శివనాయక్‌లు ఆవిష్కరించారు. ఈ వైద్య శిబిరాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గేయాలతో చైతన్యం నింపిన గాయకుడు గద్దర్


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం సంచాలకులు, సిబ్బంది

కడప కల్చరల్ : ప్రజా గాయకుడు గద్దర్ తన గేయాలతో ప్రజల్లో చైతన్యం నింపారని బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల అలంకరించి, సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత విశేషాలు, ఉద్యోగ, ఉద్యమ జీవితం, సాహిత్యం, జానపద కళల ద్వారా చైతన్యగీతాల ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో చైతన్యం కల్పించిన విధానం గురించి గుర్తుచేశారు. ఆయన నటించిన సినిమాల్లో కూడా రచనలు, పాటల ద్వారా విప్లవవాణి వినిపించిన విధం గురించి వివరించారు. విశ్రాంత ఆచార్యులు డా. మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గద్దర్ విప్లవ జీవితాన్ని వివరించారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి, రచయిత కొత్తపల్లి రామాంజినేయులు తదితరులు మాట్లాడారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఏపీ సీఎల్‌సీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, రవిశంకర్‌లు ఒక ప్రకటనలో అన్నారు. జననాట్యమండలి ద్వారా తన ఆట పాటలతో ఎంతో మందికి స్ఫూర్తి నింపారని తెలిపారు.

పునీతుల అవశేషాల దర్శనం మన భాగ్యం


రెండవ జాన్‌పాల్ పోప్ అవశేషాన్ని ఊరేగింపుగా తెస్తున్న గురువులు

కడప కల్చరల్ : పునీతులైన వారి అవశేషాలను దర్శించుకోవడం మన భాగ్యమని రెవరెండ్ బిషప్ డాక్టర్ గాలి బాలి అన్నారు. కడప నగరం మరియాపురం బిషప్ హౌస్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రెండవ జాన్‌పాల్ పోప్ అవశేషం పది రోజులుగా తెలుగు రాష్ట్రాలలోని 11 ప్రధాన పట్టణాలలో ప్రదర్శనగా వస్తుందని ఏప్రిల్ నెలలో ఈశాన్య రాష్ట్రాలో మొదలైన యాత్ర 22 రాష్ట్రాల మీదుగా ఆయా ప్రాంతాల విశ్వాసులకు అవశేషాలను దర్శింప చేస్తున్నారని తెలిపారు. ఆ యాత్రలో భాగంగానే జీసెస్ యూత్ ఆధ్వర్యంలో నేడు కడపకు ఆ అవశేషాలను ప్రజల దర్శనార్థమై తీసుకరావడం మన భాగ్యమేనన్నారు. రెండవ పోప్‌కు యువకులంటే అత్యంత ఇష్టమని యువతను మంచి దారిలో నడిపించేందుకు ప్రేమ, శాంతి మార్గాల ద్వారా నూతన సమాజం నిర్మితమౌతుందని పేర్కొనేవారన్నారు.


విశేష ఆదరణ..

రెండవపోప్ జాన్‌పాల్ అవశేషాన్ని ధగధగలాడే తెల్లని శిలువలో తీసుకరావడంతో అప్పటికే వేచి ఉన్న భక్తులలో సంతోషం వ్యక్తం అయింది. క్రైస్తవ గురువులు ఎంపిపిఎస్ డైరెక్టర్ సాగర్ బాలరాజు, మేత్రాసనం కోశాధికారి ఫాదర్ దేవరాసు, కడప డీమ్ ఎండి ప్రసాద్‌రావు, ఫాదర్లు అరుణ్, అమృత్, ప్రకాష్, మనోహర్‌ల ఆధ్వర్యంలో శిలువను ఊరేగింపుగా చర్చి వద్దకు చేర్చారు. విశ్వాసుల జయ జయ ధ్వానాల మధ్య చర్చిలో అందరి దర్శనం కోసం ప్రతిష్టించారు. అనంతరం గురువులు దివ్య బలి పూజ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం విశ్వాసులందరిని శిలువరూపులోని అవశేషాన్ని దర్శించుకునే అవకాశం కల్పించారు.

మున్సిపల్ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

కడప సెవెన్‌రోడ్స్ : తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుక వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డు కున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని ఆ తర్వాత వదిలేశారు. మున్సిపల్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు మనోహర్ కోరారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను కూడా రెగ్యులర్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నాగేంద్ర, జిల్లా నాయకులు తిరుపాల్, విజయభాస్కర్, గోపి, చంద్రారెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం మండలంలోని సి.రాజుపాళెం, జి.అప్పాయపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, డ్రైనేజ్, విద్యుత్ స్తంబాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఏ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరిస్తూ, ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అందుకే ప్రభుత్వ సిబ్బంది అంతా ప్రజల ముంగిటకు వచ్చిందన్నారు. ఏపీలో అమలవుతున్నన్ని పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అవ్వాతాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750, ప్రతి తల్లికి అమ్మ ఒడి దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు.

హామీలిచ్చి విస్మరించిన చంద్రబాబు

గతంలో చంద్రబాబు నాయుడు దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. బాబు తన పాలనంతా అవినీతికి పాల్పడ్డారని, జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు.